మంచి నీటి సమస్యను పరిష్కరిస్తాం



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ఆర్‌జీకే పింక్ బిల్డింగ్‌లోని మంచినీటి సమస్యను పరిష్కరిస్తానని డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ ఆర్‌జీకే పింక్ బిల్డింగ్‌లో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కార్పొరేటర్ వెంటనే స్పందించి జలమండలి అధికారులతోపాటు జీహెచ్‌ఎంసీ అధికారులతో ఆర్‌జీకే పింక్ బిల్డింగ్‌లో పర్యటించారు. ఈ నేపథ్యంలో తమ కాలనీలో కొన్ని సంవత్సరాలుగా మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు వివరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. వెంటనే సమస్యను పరిష్కరించేలా చూడాలని జలమండలి అధికారులకు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీయం రేణుక, మేనేజర్ సైయ్యద్ సాదిక్, జీహెచ్‌ఎంసీ ఏఈ మూర్తి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేద్దామని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు సీతారాం అన్నారు. బుధవారం నెక్నాంపూర్‌లోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్, విద్యుత్, రోడ్లు, మంచి నీరు, వీధి దీపాలు, బస్‌స్టాప్‌ల నిర్వహణ తదితర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు ధన్‌రాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ధర్మసాయి ట్రస్టు ప్రతినిధి శివదత్త సాయి

శంషాబాద్: దసరా పండుగ సందర్భంగా పట్టణంలోని ధర్మగిరి ఆలయం ధర్మసాయి ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. వ్యవసాయ క్షేత్రాలు, వివిధ నిర్మాణ పనుల్లో ఉన్న కూలీల దగ్గరికి స్వయంగా ధర్మసాయి ట్రస్టు ప్రతినిధి శివదత్తసాయి వెళ్లి దుస్తులను అందజేశారు. ప్రతి ఏటా దసరా పండుగ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా వీలైనంత మేరకు పేదలకు దుస్తుల పంపిణీతో పాటు అన్నదాన ప్రసాదాలను అందజేస్తున్నామన్నారు.

నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: దేవి నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో నిబంధనలను పాటిస్తూ జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి సూచించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాల్లో దుర్గా మాత విగ్రహ ఏర్పాట్ల నిర్వాహకులతో శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఇన్‌స్పెక్టర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శబ్దకాలుష్యం లేకుండా, బాణసంచాలను వినియోగించకుండా నవరాత్రులను జరుపుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐలు భాస్కర్‌రావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో..



మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో కొనసాగుతున్న శ్రీ గాయత్రీదేవి విగ్రహాల ప్రతిష్ఠాపన పూజల్లో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం బుధవారం పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధన్‌రాజ్, నాయకులు పాల్గొన్నారు.

దావత్‌లలో మందు బంద్

హైదర్‌గూడ వాసుల శపథం



మద్యపానం నిషేధంపై శపథం చేస్తున్న నాయకులు

అత్తాపూర్: గాంధీ జయంతి సందర్భంగా అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ వాసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. శుభకార్యాలలో, దావత్‌లలో మద్యపానాన్ని నిషేధిస్తూ తీర్మానించారు. అన్ని సామాజిక వర్గాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు దావత్‌లలో మద్యపానం జోలికి వెళ్లరాదని, నిర్వాహకులు మద్యం సేవించకూడదని శపథం చేశారు. శుభకార్యాలలో లేదా దావత్‌లలో బహిరంగంగా మద్యపానం సేవించడం వల్ల మహిళలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. యువతరంపై మద్యపానం దుష్ప్రభావం చూపుతోందని రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు ఆందోళనలు వ్యక్తం చేశారు. మందు పార్టీల నిషేధం ద్వారా మిగిలే డబ్బులను సామాజిక సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు సుభాష్‌రెడ్డి, రామేశ్వరరావు, మల్లారెడ్డి, కొమురయ్య, కార్పొరేటర్ సంగీత, మాజీ కౌన్సిలర్ రవీందర్, సామాజిక కార్యకర్త జర్నలిస్ట్ మధు తదితరులు పాల్గొన్నారు.



మణికొండలో.. చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు



మణికొండలో.. వాసవి క్లబ్ నాయకులు

ఘనంగా గాంధీ జయంతి

అత్తాపూర్: మహాత్ముడి సేవలను ప్రతి ఒక్కరు స్మరించుకుని ఆయన ఆశయాలకనుగుణంగా ముందుకు సాగాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకొని గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో లంగర్‌హౌస్‌లోని బాపుఘాట్ వద్ద ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అదేవిధంగా అత్తాపూర్‌లో కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, లాలా లజపతిరాయ్ శక్తి కేంద్రంలో బీజేపీ అధికార ప్రతినిధి రాచూరి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ భవన్‌లో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి సందర్భంగా ఇరువురి చిత్రపటాలకు బీఆర్‌ఎస్ నాయకులు గుర్రంపల్లి యాదగిరి, నరేందర్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు భాస్కర్‌గౌడ్, దుర్గా ప్రసాద్, సంతోష్‌వర్మ, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు. మణికొండ, నార్సింగి మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు.ఏజీవర్సిటీ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి గాంధీ చిత్రపటానికి పలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో కళాశాల అసోసియేట్ డీన్ ప్రశాంత్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండ్లగూడ పోలీస్ అకాడమీలోని రాణి రుద్రమదేవి సెమినార్ హాల్‌లో అకాడమీ డైరెక్టర్ అభిలాష బీస్ట్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు మహాత్మగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ సునీతామోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు, అడ్విన్ ప్రసాద్, ఔట్‌డోర్ ఏడి రమణ, శ్రీదేవి, డీఎస్పీలు కృష్ణ, జగదీశ్వర్, తిరుపతి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



నార్సింగిలో.. కాంగ్రెస్ నాయకులు అశోక్‌యాదవ్, జైపాల్‌రెడ్డి తదితరులు



తిరుమలహిల్స్ కాలనీలో.. ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ అవినాష్, కాలనీ వాసులు



నార్సింగిలో క్రీడా పోటీల్లో గెలిచిన మున్సిపల్ సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్లు



వట్టినాగులపల్లిలో.. మాజీ చైర్‌పర్సన్ రేఖయాదగిరి, కాంగ్రెస్ నాయకులు



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో.. అధికారులు, సిబ్బంది



కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాలలో.. అధికారులు, విద్యార్థులు



పోలీస్ అకాడమీలో.. నివాళులర్పిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ సునీతామోహన్ తదితరులు



అలకాపూర్ ఎంజీ పార్కులో.. టౌన్‌షిప్ అధ్యక్షుడు, ప్రజలు



పుప్పాలగూడలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



నార్సింగిలో.. చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు, సిబ్బంది



లంగర్‌హౌస్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, తదితరులు



గాంధీ భవన్‌లో.. గుర్రంపల్లి యాదగిరి, నరేందర్‌రెడ్డి



అత్తాపూర్‌లో.. కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, తదితరులు



బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడి కేంద్రంలో.. యూత్ క్లబ్ సభ్యులు



నివాళులర్పిస్తున్న నాయకులు

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 3 నుంచి 7 తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఐదు రోజుల పాటు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వివేకానందగుప్తా, కార్యదర్శి చింతల నంద కిశోర్‌గుప్తా, కోశాధికారి చింతల రామకృష్ణ గుప్తా తెలిపారు. తొలిరోజు ఆకుపచ్చ వర్ణంలో అలంకరణ, రెండో రోజు మిశ్రమ వర్ణాలతో అలకరణ, మూడోరోజు పసుపు, నాలుగోరోజు ఎరుపు, ఐదో రోజు తెలుపు వర్ణాలతో స్వామివారిని అలంకరించి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు అభిషేకం, ప్రసాద వితరణ కార్యక్రమాలతో పాటు సామూహిక విష్ణు సహస్ర పారాయణం, నిత్యహోమం, కుంకుమార్చన, కల్యాణం, తిరువీధి ఉత్సవం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోవాలన్నారు.

ధర్మగిరి ఆలయంలో..

పట్టణంలోని ధర్మగిరి దేవాలయంలో ఈ నెల 3 నుంచి 12 వరకు దేవీనవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు నిత్యహోమం, అన్నదాన కార్యక్రమాలతో పాటు అమ్మవారి అలంకరణలు ఉంటాయని ఆలయ ట్రస్టు శివదత్తసాయి తెలిపారు. అదే విధంగా ఊట్‌పల్లిలో శృంగేరి శంకరమఠంలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఎన్‌ఐఆర్‌డీలో 'స్వచ్ఛభారత్'

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఎన్‌ఐఆర్‌డీలో మహాత్మగాంధీ జయంతి సందర్భంగా 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌ఐఆర్‌డీ నుంచి రాజేంద్రనగర్‌లోని కమాన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్లకు ఇరువైపుల ఉన్న చెత్తను తొలగించి, వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఐఆర్‌డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేంద్రకుమార్, రిజిస్ట్రార్ మనోజ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ రఘు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, మహిళలు



స్వచ్ఛభారత్‌లో భాగంగా చెత్తను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

అత్తాపూర్: బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవాలయ నీటి కుంటలో బతుకమ్మల నిమజ్జనాల ఏర్పాట్లను కంటెస్టెడ్ కార్పొరేటర్ భాస్కర్ గౌడ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనానికి వచ్చే దారిలో లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్‌గౌడ్, బోయ రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జన నీటి కుంటను పరిశీలిస్తున్న గోవర్ధన్‌రెడ్డి తదితరులు

కంటి పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలి



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అత్తాపూర్: ప్రతి ఒక్కరు కంటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని ఐరిస్ ఫౌండేషన్ వైద్యురాలు సోనాలి అన్నారు. రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్ బ్రిగేడ్ పబ్లిక్ పాఠశాలలో కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటిని నిర్లక్ష్యం చేస్తే తర్వాత ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రమేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో...



గౌరమ్మకు పూజలు చేసిన మహిళలు



మణికొండ క్వార్టర్స్‌లో.. బతుకమ్మలకు పూజలు చేసిన మహిళా కౌన్సిలర్లు



మణికొండ ఎంజీ పార్కులో.. కౌన్సిలర్లు, అసోసియేషన్ నాయకులు

మణికొండ: తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలతో పాటు పూలకు, ప్రకృతికి పెద్దపీట వేసేలా నిర్వహించే బతుకమ్మ ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి, మంచిరేవుల, గండిపేట, కోకాపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి, మిర్జాగూడ తదితర గ్రామాలలో బుధవారం మహిళలు ఎంగిలిపూల బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూరా తిరుగుతూ పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం ఇళ్లు, అపార్ట్‌మెంట్‌ల ముందు మహిళలందరూ కలిసి బతుకమ్మ ఆడిపాడారు. అక్కడి నుంచి అలకాపూర్ టౌన్‌షిప్ పరిధిలోని ఎస్‌వీ పార్క్, ఎంజీ పార్కు, మణికొండ క్వార్టర్స్‌లోని బతుకమ్మ పార్క్, మణికొండ పాత గ్రామాలలో మహిళలు పెద్ద ఎత్తున సామూహికంగా బతుకమ్మ ఆడారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట, ఖానాపూర్ గ్రామాలలో మహిళలు పెద్ద ఎత్తున సామూహికంగా ఎంగిలిపూల బతుకమ్మలను ఆడారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా గ్రామాలలో కౌన్సిలర్లు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, మున్సిపాలిటీలు ఏర్పాట్లు చేశాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పలు ప్రాంతాలలో మహిళలు, చిన్నారులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారుచేసి ఇంటి ముంగిట్లో గౌరమ్మను పూజిస్తూ ఆడిపాడారు. అత్తాపూర్, హైదర్‌గూడ, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.











కోకాపేట లాంజ్ గేటెడ్ కమ్యూనిటీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మణికొండలో బతుకమ్మలతో మహిళలు



అలకాపూర్ ఎంజీ పార్కులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బ్యాండు మేళాలతో బతుకమ్మలతో పార్కులకు వస్తున్న అలకాపూర్ వాసులు



అలకాపూర్ పార్కులో బతుకమ్మలకు పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్